www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 18 మే 2025





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పి.మధు

ఫలరాజు..ధర లేక దిగాలు

- తెగుళ్లు, ఎండలతో తగ్గిన దిగుబడి
- మార్కెట్‌లో కానరాని మామిడి
- గిట్టుబాటు ధరలూ అంతంతే
- ఆందోళనలో మామిడి రైతులు

మామిడి రైతులకు ఈ ఏడాది కన్నీళ్లే మిగులుతున్నాయి. కష్టనష్టాలకు ఓర్చుకుని ఏళ్ల తరబడి మామిడి తోటలను సాగు చేస్తున్నా.. పంట దిగుబడి రావడం లేదు. వాతావరణంలో మార్పులు మామిడిపై తీవ్రంగా ఉండడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్ని చోట్ల ఎండ వేడిమికి మామిడి కాయలు రాలిపోగా, మరికొన్ని చోట్ల మామిడి చెట్లకు రోగం వచ్చి కాయలు రాలిపోయాయి. వేసవి వచ్చిందంటే పండ్లలో రారాజుగా పిలవబడే మామిడిని రుచి చూడని వారు ఉండరు. అలాంటిది ప్రస్తుత మామిడి కాయలు పెద్దగా కనిపించడం లేదు. అరకొర మామిడికాయలు మార్కెట్లో దర్శనమిస్తే వాటి ధరలు కూడా లేవు. ఈసారి మామిడి దిగుబడి బాగా తగ్గడంతోనే ధరలు పెరిగిపోయాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.



ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా వ్యాప్తంగా మామిడి తోటల సాగు ఎక్కువగా ఉంది. ఎంతో ఆశగా మామిడి పండు సాగు చేస్తున్న రైతన్నకు సరైన గిట్టుబాటు ధరలు లేక ఐదేళ్లుగా మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి రైతులకు గతేడాది కంటే ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక నష్టపోయారు. కొన్ని చోట్ల ఎండ వేడిమికి మామిడి కాయలు రాలిపోగా, మరికొన్ని చోట్ల మామిడి చెట్లకు రోగం వచ్చి కాయలు రాలిపోయాయి. ఇక్కడ నుండి ముంబయి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాలకు మామిడి కాయలను ఎగుమతి చేస్తారు. గతంలో మామిడి పూతను చూసి వ్యాపారస్తులు మామిడి పంటను కొనేవారు ప్రస్తుతం మామిడి కాయలను చూసి వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. గతంలో మాదిరిగా వ్యాపారస్తులు ఉత్సాహం చూపడం లేదు. అనుకున్నంత ఏడాది అనుకున్నంత మామిడిపంట రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 89,667.5 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. రాయచోటి మండలం మాధవరం, గొర్ల ముదివేడు, సంబేపల్లి, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, వీరబల్లి, సుండుపల్లి మండలాల్లో మామిడి తోటలో అధికంగా ఉన్నాయి. మొదట్లో ఎక్కువ మొత్తంలో చెట్లకు పూత వచ్చింది. ఈసారి వాతావరణ మార్పులు, నాసిరకమైన మందులు పిచికారి చేయడంతో కూడా పూత నిలబడక రాలిపోయింది. వేల రూపాయలు వెచ్చించి మామిడి తోటలకు మందులు పిచికారి చేసిన దిగుబడి రాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా దాదాపు రూ.200 కోట్లకు పైగా విలువైన దిగుబడిలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు.



ఈదురు గాలులకు నేల రాలిన మామిడి కాయలు (ఫైల్ ఫోటో)

ఈసారి అధిక వర్షాలు, గాలులతో వాతావరణం మార్పులతో దిగుబడి తగ్గిపోయింది. రైతులు ఆందోళన చెందుతున్నారు.

మార్కెట్లో కానరాన్ని మామిడి పండ్లు..

మామిడి ధరలు ఎండలతో సమానంగా మండిపోతున్నాయి. మార్కెట్లో ఎక్కడ చూసినా కూడా మామిడి పండ్లు కనిపించడం లేదు. ఒకవేళ కనిపించినా చాలా తక్కువ మోతాదులో మామిడి కాయలు ఉంటున్నాయి. మార్చి చివరి వారం నుంచి మే వరకు మార్కెట్‌లో అధిక మొత్తంలో మామిడి పండ్లు కనిపిస్తాయి. ఈసారి మామిడి దిగుబడి తగ్గడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాపారులు చెబుతున్నారు. పూత రాకపోవడంతో వచ్చినా కూత కూడా రాలిపోవడంతో మామిడి దిగుబడిపై ప్రభావం పడింది.గతం లో శీతాకాలంలో మామిడి చెట్లకు దట్టంగా పూత వచ్చిన ఆ తర్వాత వాతావరణంలో మార్పులు కారణంగా నిలబడక పోవడం, నాసిరకమైన మందులు ప్రభావంతో పూత నిలబడలేదని రైతులు వాపోతున్నారు. దీనికారణంగానే మార్కెట్లో ఎక్కడ మామిడి పండ్లు కనిపించడం లేదు. అరకొరా కొన్ని మామిడి పండ్లు కనిపించినా టన్ను రూ.20 వేల నుంచి రూ.25 వేలు, బెనిషా టన్ను రూ.30 వేల నుంచి రూ.35 వేలు, ఖాదర్ టన్ను రూ.40 వేల 45 వేలు, మల్లికా టన్ను రూ.40 నుంచి రూ.45 వేలు వరకు మార్కెట్‌లో అమ్ముతున్నారు.

వెలవెల పోతున్న మామిడి మండీలు

జిల్లాలో మామిడి కాయలను విక్రయించేందుకు పలు మండీలు ఉన్నాయి. రైతులు, వ్యాపారస్తులు మామిడి కాయలను ఈ మండీలకు చేరవేసి అమ్ముకుంటుంటారు. మామిడి దిగుబడి తగ్గడంతో మండీలకు మామిడి కాయలు రాకపోవడంతో మామిడి మండీలు వెలవెల పోతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో కొంతమంది వ్యాపారులు మామిడి షెడ్లను ఏర్పాటు చేశారు. ఆయా మండలాలలోని రైతులు ఆ మామిడి షెడ్లకు మామిడి కాయలను తరలించి విక్రయిస్తుంటారు. ఆ షెడ్లకు కూడా మామిడి కాయలు రాక పోవడంతో అవి కూడా వెలవెల పోతున్నాయి.

వీరబల్లి బేనీషాకు భలే గిరాకీ

ప్రతి ఒక్కరికి వీరబల్లి బేనీషా అంటే ఎంతో ఇష్టం. ఈ బేనీషా చాలా రుచిగా ఉంటుంది. ఈ బేనీషాను కొనుగోలు చేయడానికి ఢిల్లీ, ముంబై, కలకత్తా ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు వచ్చి కొనుగోలు చేసి తీసుకొని వెళుతుంటారు. ఈ వీరబల్లి బేనీషాను మన రాష్ట్రమే కాదు విదేశాలు కూడా ఎగుమతి చేస్తుంటారు. బేనీషాకు అంత పేరు వచ్చిందని చెప్పవచ్చును. వీరబల్లి మండలంలో మామిడి తోటలో అధికంగా ఉన్నాయి. అందుకోసమే మామిడి ప్రియులు ఈ బేనీషాను ఇష్టపడతారు.

అధిక ఖర్చులు వస్తున్నాయి



మామిడి పంట సాగు చేయాలంటే రైతులకు అధికష్టాలు వస్తున్నాయి. మామిడి పంటలు తోటలో దున్నకం, పాదులు తీయడం, కంచే, చెట్లకు ఎరువులు, మందులు, నీరు కట్టడం వంటివి చాలా అవసరం. ఇంత కష్టపడినప్పటికీ నాలుగేళ్లుగా మామిడి పంట సరిగ్గా రావడం లేదు పెట్టుబడి ఎక్కువ అవుతుంది ఆదాయం తగ్గుతున్నది. ప్రభుత్వం ఆదుకొని న్యాయం చేయాలి.

- రెడ్డయ్య, రైతు, వండాడి, చిన్నమండెం.

ఇబ్బందిగా ఉంది



ఐదేళ్లుగా మామిడి పంట సరైన దిగుబడి లేక ఇబ్బందిగా ఉంది. వరి, వేరుశనగ, కంది వంటి పంటలు కూడా వర్షాలు లేక పంటలు చేతికి రావడం లేదు. కనీసం మామిడి పంటైనా చేతికొస్తాదనుకుంటే పంట లేదు, రేట్లు కూడా లేవు పెట్టిన పెట్టకూడదు కూడా రావడం లేదు.

- సుబ్బారెడ్డి, రైతు, యండపల్లి, రాయచోటి.

ప్రభుత్వం ఆదుకోవాలి



జిల్లాలో మామిడిపండు సాగు చేసిన ప్రతి రైతుకు రాష్ట్ర, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి. రైతులకు కూలీలు ఖర్చులు అధికమవుతున్నాయి. మామిడి పంట కూడా తక్కువగా వస్తున్నది. మామిడి చెట్లు ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి. నష్టపరిహారం కూడా అందించాలి.

- రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, రాయచోటి.

వాతావరణం మార్పిడి



ఈ ఏడాది లో వాతావరణం మార్పిడి కారణంగా మామిడి పూత లేటుగా, తక్కువగా పూసింది. ఖరీఫ్ మొదటలో జూన్ మాసంలో మామిడి చెట్ల కత్తిరింపులు, దున్నకాలు చెట్లకు పాదులు వంటివి చేసుకోవాలి.

- పి.రవిచంద్ర, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, అన్నమయ్య.

అందరికీ విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

- మాజీ ఎంపీ పి.మధు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అందరికీ విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మాజీ ఎంపీ పి.మధు తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు 17 నుండి 26వ తేదీ వరకు విశ్వం విద్యా సంస్థల వద్ద నిర్వహించడం జరుగుతోంది.ఐ ఈ శిక్షణ తరగతులు ప్రారంభానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఈ పది రోజులు శిక్షణా తరగతులలో సామాజిక బాధ్యత విలువలు నేర్చుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్యం ప్రయివేటీకరణ చేస్తోందని దీనికి వ్యతిరేకంగా విద్యార్థులు ప్రశ్నించి పోరాడాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు ఉపాధి, కేంద్రంలో ఉన్న కాళీ పోస్టులు భర్తీకై ఉద్యమించాలన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ రిజర్వేషన్లను తుంగలోకి తొక్కుతున్నారన్నారని విమర్శించారు. ఈ విధానాల వల్ల పేదలకు చదువు అందని ద్రాక్షగా మారుతోందని వివరించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుతామని, ఎల్కేజీ నుండి పేజీ వరకు ఉచిత విద్యా అందిస్తామని చెప్పి, నేడు అధికారంలో వచ్చాక ప్రభుత్వ పాఠశాలలను ధ్వంసం చేయడమే విధిగా పెట్టుకుందన్నారు. విద్యారంగాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ పేద విద్యార్థుల నడ్డి విరుస్తోందన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు చదువుతోపాటు రాజకీయాలను అధ్యయనం చేసుకుని సమాజ మార్పు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది సోమశేఖర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ప్రసన్న కుమార్, ఎ.అశోక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నరసింహా, డి.రమణ, రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి.శ్రీనివాసులు, రవి పాల్గొన్నారు.

చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి



అధికారులతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి, కలెక్టర్

పట్టణాన్ని చెత్త రహిత మున్సి పాలిటీగా తీర్చి దిద్ది పట్టణంలో పచ్చద నాన్ని పెంపొందించాలని రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ మోర్ మార్కెట్ సమీపంలో నిర్వహించిన 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా మంత్రి, కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ఒక్కరూ మన ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. అన్ని నివాసిత ప్రాంతాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆసుపత్రులు, బస్సు స్టాపులు, రైల్వేస్టేషన్‌లు, పరిశ్రమలు తదితర ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను ముమ్మరంగా చేపటామన్నారు. పర్యావరణ పరిరక్షణ అంశంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంటి పరిసర ప్రాంతా లలో మొక్కలు నాటి పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ప్రజలు ఎప్పుడు ఆరోగ్యంగా, ఆనందంగా, సంతోషంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించా మున్సిపాలిటీ వారు ప్రతి ఇంటి నుండి సేకరించిన చెత్తను తడి,పొడి చెత్తగా విభజించి తడి చెత్త నుంచి కంపోస్ట్ తయారు చేసి సంపద సృష్టించే కార్యక్రమం చేపట్టాలన్నారు. 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ప్రభుత్వం సంకల్పించిన లక్ష్యానికి చేరుకోవాలని సూచించారు. ముఖ్యంగా పట్టణంలోని దుకాణదారులు వేస్ట్ మెటీరియల్‌ను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్తకుండీలలో మాత్రమే వేయాలన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛత కోసం ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి నెల మూడవ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాలు, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో పరిశుభ్రత కార్యక్రమాలు వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో వృద్ధులు, మహిళలు ఎండ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకునేందుకు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వైద్య ఆరోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మనుషులతో పాటు జంతువుల కూడా సంతోషంగా జీవించే విధంగా జంతువుల సంరక్షణలో భాగంగా అడవి ప్రాంతాలలో ఉన్న జంతువులకు నీటితొట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో రాయచోటి పట్టణం పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ నుంచి బంగ్లా సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి బంగ్లా సర్కిల్ వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలతో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిలై పాల్గొన్నారు.

గ్రీన్ షేడ్ నెట్‌ను ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి


రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం పట్టణంలోని బంగ్లా సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ షేడ్ నెట్‌ను కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ట్రాఫిక్ సిగ్నల్ పడినప్పుడు వాహనదారులకు ఎండ సమస్య తలెత్తకుండా ఉండేందుకు గ్రీన్ షేడ్ నెట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ముఖ్యమైన స్లమ్ ఏరియాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వృద్ధులు మహిళలు ఎండ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మున్సిపల్ కమిషనర్ వాసు బాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డికి మైనార్టీల వినతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురంలో మైనార్టీ గురుకుల డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానిక ముస్లిం మైనార్టీలు కోరారు. శనివారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టణంలోని తరిగొండ రోడ్డులో మైనార్టీ గురుకుల పాఠశాలను ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ పాఠశాలలో రాష్ట్రంలోని నలుమూలల నుండి దాదాపు 500 మంది విద్యార్థినీలు విద్యను అభ్యసిస్తున్నారని, ఇక్కడే ఇంటర్మీడియట్ కళాశాల కూడా ఉందన్నారు. మైనార్టీలకు డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఎంతో మంది పేద మైనార్టీ విద్యార్థినీలు దూరపు ప్రాంతాలకు వెళ్లలేక చదువును ఇంటర్మీడి యట్‌తో నిలిపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ వరకూ ఉన్న కళాశాలను డిగ్రీ స్థాయికి పెంచాలని తెలిపారు. పేద ముస్లిం విద్యార్థినీలకు డిగ్రీ విద్యను అందించాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మైనార్టీలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కువైట్ బాబు, సయ్యద్‌బాషా, నిజాముద్దీన్, మొహమ్మద్ అలీ, సాధిక్, చాను, హనీఫ్, జాఫర్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మైనార్టీ నాయకులు



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కళాజాతా బృందాలతో ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు, అన్నమయ్య జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కురబలకోట మండలంలోని అంగళ్లు గ్రామంలోని టమోటా మార్కెట్ వద్ద శనివారం హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాబృందమైన కె.సి.నటరాజ్ కళాబృందం జానపద గీతాలు, నాటికల రూపంలో ప్రజల్లో చైతన్యం నింపే ప్రయత్నం చేసింది. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాపించే మార్గాలు, వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం వారి ద్వారా ఉచితంగా లభించే ఎఆర్‌టి మందుల వినియోగం అవసరం, ఎయిడ్స్ బాధితుల పట్ల సమాజం వివక్షత చూపకూడదని ఈ సందర్భంగా వివరించారు. జిల్లాలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణలో భాగంగా కళాజాత బృందాలు ఈ నెల 31వ తేదీ వరకు వివిధ ప్రదేశాలలో కళా జాత బృందం హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి పైన, రక్తదానం సుఖవ్యాధులపై వీధి నాటకాలు ద్వారా ప్రజలకు అవగాహన నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 1097 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం పొందవచ్చని సూచించారు. అవగాహన కార్యక్రమానికి స్థానిక ఆర్‌ఆర్‌ఎస్ సభ్యులు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, ఆరోగ్య సూపర్వైజర్లు పాల్గొన్నారు.

నేడు ఎయిడ్స్ క్యాండిల్ లైట్ డే ర్యాలీ

- జిల్లా కుష్టు, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ శైలజ

ప్రజాశక్తి-రాయచోటి

ఎయిడ్స్ వ్యాధితో తమ జీవితాలను కోల్పోయిన వారి జ్ఞాపకార్థం ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా రాయచోటిలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుండి డైట్ కళాశాల వరకు సాయంత్రం 6:30 గంటల నుండి 7:30 గంటల వరకు సైలెంట్ ర్యాలీ నిర్వహిస్తామని జిల్లా కుష్టు ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ శైలజ పేర్కొన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 1న అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం జరుపుకోవడంతో పాటు ప్రతి సంవత్సరం మే నెల మూడవ ఆదివారాన్ని అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. హెచ్ఐవి లేదా ఎయిడ్స్ వ్యాధితో ఎంతోమంది ప్రాణాలు, జీవితాలను కోల్పోయారని, వారి జ్ఞాపకార్థం కోసం, హెచ్ఐవితో జీవిస్తున్న ప్రజలకు సహాయం చేయడానికి తమ జీవితాలను అంకితం చేసిన వారి సేవలను గుర్తించడం కోసం, సమాజంలో హెచ్ఐవి లేదా ఎయిడ్స్ వ్యాధి వల్ల వచ్చే కలిగే సామాజిక, ఆర్థిక నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహించుకుంటున్నామని తెలిపారు. పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డైట్ కళాశాల వరకు "మేము గుర్తించుకుంటాం మేము మాట్లాడతాం మేము నడిపిస్తాం"అనే థీమ్‌తో ఈ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ ఉంటుందని తెలిపారు.

'మనం' సంస్థ సేవలు అమోఘం

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని మనం సామాజిక సేవా సంస్థ వారు చేస్తున్న సేవలు అమోఘమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మనం సేవ సంస్థ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 3 ఆక్సిజన్ అంబులెన్సులు, ఒక ఐసియు వెంటిలేటర్ అంబులెన్స్, 2, రథాలు, 8 ఫ్రీజర్ బాక్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మనం సామాజిక సేవా సంస్థ వారు రాయచోటి పట్టణంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు ఎనలేని సేవలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజులలో మనం సేవా సంస్థ వారు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి-రాయచోటి

18 సంవత్సరముల లోపు ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కార్యక్రమం 13వ తేదీ నుంచి జూన్ నెల 9వ తేదీ వరకు జరుగతుందని జిల్లా సహిత విద్యా సమన్వయ అధికారి (ఐఇ కో-ఆర్డినేటర్) కొన్నిపాటి జనార్దన తెలిపారు. శనివారం పాఠశాల విద్యాశాఖా, సమగ్రక్షా ఆదేశాల మేరకు (ప్రత్యేర్ అవసరాల) పిల్లలను గుర్తించి, బడిలో చేర్పించి వారికి ప్రభుత్వం కల్పించే అన్ని సదుపాయాలను సరించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని షేక్ మహమ్మద్ అనాస్‌ను నూనె భవితను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రంనకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు వారి అంగ వైకల్యం ను బట్టి రూ. 6 వేలు, రూ. 10 వేలు రూ. 5 వేలు ప్రతి నేల సహాయం ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ, అలవెన్స్‌ల రూపంలో తోడ్పాటు ఇస్తుందని పేర్కొన్నారు. ఫిజియోథెరఫీ సేవలు కూడా అందిస్తుందని పరిక్షలలో స్క్రైబ్ సహాయంతో పాటు పాస్ మార్కులు కూడా తగ్గింపు ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్, ఐఇఅర్ పిలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లాలో ఆరుగురు ఎస్ఐలు బదిలీ

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లాలో ఆరుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్‌పి విద్యా సాగర్ నాయుడు శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. సైబర్ క్రైమ్ ఎస్ఐ నరసింహారెడ్డి వీరబల్లికి, వీరబల్లి ఎస్ఐ టివిఎన్ చిరంజీవి సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. నవీన్ బాబు గుర్రంకొండ నుంచి చిట్వేల్ కు, రఘురాం చిట్వేల్ నుంచి గుర్రంకొండకు, లోకేష్ రాయచోటి నుంచి పీలేరుకు, బాలకృష్ణ పీలేరు నుంచి రాయచోటికి బదిలీ చేస్తూ ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. వారికి కేటాయించిన పోలీసుస్టేషన్‌లలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మదనపల్లి అగ్నిమాపక కేంద్రంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు అగ్నిమాపక అధికారి శివప్ప తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలోని సిబ్బంది అందరూ శుభ్రత, స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. తర్వాత ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, అగ్నిమాపక కేంద్ర ప్రాంగణంలో ప్రజల వినియోగానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అగ్నిమాపక కేంద్ర అధికారి శివప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల అనేక రకాల వ్యాధులను నివారించవచ్చునని మన ఆరోగ్య రక్షణకు మొదటి మెట్టన్నారు. కార్యక్రమంలో కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన 'చమర్తి'

- సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-రాజంపేట -అర్బన్

బిసి వెల్ఫేర్ శాఖ మంత్రి, కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సబితను పెనుగొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలకు సంబంధించిన టిడిపి నాయకులతో కలిసి రెండు మండలాలకు సంబంధించి పలు అభివృద్ధి విషయాలపై వారితో చర్చించినట్లు చమర్తి తెలిపారు. అనంతరం మంత్రి సబితకు పుష్ప గుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలోని కడప జిల్లా పరిధిలో గల సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలకు సంబంధించి అనేక సమస్యలను, అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి దృష్టికి తీసుకుపోయానని పేర్కొన్నారు. అందుకు మంత్రి వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ మండలాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలియజేసారు. కార్యక్రమంలో ఆయన వెంట ఒంటిమిట్ట టిడిపి మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, సిద్ధవటం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కాంట్రాక్టర్ కరెంట్ రమణ, బొబ్బిలి రాయుడు, మాజీ జడ్‌టిసి చలమయ్య యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ దశరథ నాయుడు, శ్రీనివాసరాజు, ప్రతాప్ నాయుడు, రమణ, పలువురు టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు



పుల్లంపేట : రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సానేశేఖర్

ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎంపిడిఒ అబ్దుల్ రహీం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జనసంచారం ఉన్న ప్రాంతాలలో వైద్యశాలలు ఏర్పాటు చేయాలని, అక్కడ ఉన్న ప్రజలకు ఎండ తీవ్రత వల్ల వచ్చే నష్టాలు గురించి వివరించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందువల్ల ప్రజలు మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు రాకుండా ఉండాలని సూచించినట్లు తెలిపారు. ఎండ తీవ్రత వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని వారికి ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారా లేదా అని ఆరాతీశారు. ఉచిత వైద్య శిబిరంలో ఉన్న మందులను పరిశీలించి బిపి సరిచూసుకున్నారు. వేణుగోపాలస్వామి ఆలయంలో పక్షులకు నీటి తొట్టిలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథనాయుడు, ఎఎస్ఐ మల్లికార్జున, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ ముబారక్ అలీ, ఇర్ఫాన్‌బాషా, జావిద్, భాష ఫీల్డ్ అసిస్టెంట్ జిలానిభాష, అంగన్వాడి కార్యకర్త సరళ, వైద్య సిబ్బంది రామకృష్ణమ్మ, సంపూర్ణ, బిల్ కలెక్టర్ హరి,మహిళ పోలీసులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట :** వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రత వేడి గాలుల కారణంగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని దీనికి సరైన సమయంలో చికిత్స తీసుకుపోతే ప్రాణాంతకం అవుతుందని పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సానేశేఖర్ పేర్కొన్నారు. ఆ వేసవికాలంలో మద్యం సేవించకూడదని, రోడ్డు ప్రక్కన ఉండే పానీయాలు తాగకూడదని, రోడ్డు మీద కలుషిత ఆహారం తినకూడదని, మాంసం తినకూడదు, కాయగూరలు మాత్రమే ఎక్కువ తినాలని సూచించారు. ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే రోజుకు 15 గ్లాసులు పరిశుభ్రమైన నీరు తాగాలని పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, భోజనం మితంగా తినాలని, ఎండలో ఎక్కువ తిరగకూడదని అన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ రాజా, పిహెచ్ఎన్ అరోహరమ్మ ,సూపర్వైజర్ మహేష్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసన్నకుమార్, ఫార్మసిస్ట్ కృష్ణయ్య , స్టాఫ్ నర్సులు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. .**కలికిరి:** వడదెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సిహెచ్‌సి వైద్యులు పవన్ కుమార్ వైద్యశిబిరం నిర్వహించారు. వేసవి కాలం లో ఎండలు తీవ్రత అధికంగా ఉంటుందనిపజలు మధ్యాహ్నం సమయంలో అనవసరంగా బయట తిరుగుకుండా ఉండాలని, తద్వారా వడదెబ్బ గురికాకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్‌కిరణ్, డాక్టర్ శశికుమార్‌రాజు, ఫిజియోథెరపిస్టు మురళి, పారామెడికల్ సిబ్బంది, శానిటేషన్ వర్కర్స్ పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు

కలకడ : ప్రజల దాహార్తి కోసమే మండల కేంద్రమైన కలకడలో చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్ ఎదుట, గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి తాకిడి వల్ల బాటసారులు, ప్రయాణికులు నీటి దాహార్తిని తీర్చుకోవడానికి ఈ చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడమే కాకుండా అక్కడ ఉన్న కుండలో ప్రతి రోజూ నీటిని నింపడం, వాటిని శుభ్రంగా ఉంచేలా గ్రామపంచాయతీ సిబ్బంది చొరవ చూపాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలయ్యగారిపల్లి సర్పంచ్ విశ్వనాథ నాయుడు, ఎఎస్ఐ మల్లికార్జున, మార్కెటింగ్ యాడ్ కమిటీ డైరెక్టర్ ముబారక్ అలీ, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, కలకడ ఫీల్డ్ అసిస్టెంట్ జిలానిబాషా, వై.వెంకటరమణ, జావిద్‌అలీ, ఇర్ఫాన్‌బాషా, సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



రిఫ్రిజిరేటర్ అందిస్తున్న ఎంపిపి ముద్దా వెంకటసుబ్బారెడ్డి

పిహెచ్‌సికి రిఫ్రిజిరేటర్ వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మండల అధ్యక్షుడు ముద్దా వెంకటసుబ్బారెడ్డి ఆయన తల్లిదండ్రులు ముద్దా మనోరంజనమ్మ ముద్దా పెద్దసుబ్బారెడ్డిల జ్ఞాపకార్థం 165లీటర్ల రిఫ్రిజిరేటర్ వితరణగా ఇచ్చారు. వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల సౌకర్యార్థము ఈ రిఫ్రిజిరేటర్‌ను ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సానేశేఖర్‌కు అందించారు. ఎబి రామ్మోహన్‌రెడ్డి తన తల్లి దండ్రులు నరసమ్మ ఆరెపురెడ్డిల జ్ఞాపకార్థంగా బ్లూ స్టార్ వాటర్ కూలర్‌ను వితరణగా అందించారు. కాగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ముఖ్యంగా రోగులకు వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని పెద్ద మనసుతో రిఫ్రజరేటర్, బ్లూస్టార్ వాటర్‌కూలర్‌ని వితరణగా ఇచ్చిన ముద్దా వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డికి వైద్యాధికారులు మనోజ్, చంద్ర శ్రీనిజ ధన్యవాదాలు తెలి పారు. కార్యక్రమంలో సిహెచ్ఒ రాజా, సూపర్వైజర్ మహేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టమోటా రైతులను ఆదుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

కష్టాల్లో ఉన్న టమోటా రైతులను ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గోపి దిన్నే, ఎద్దులవారిపల్లిలలో పర్యటించారు. టమాటా రైతుల కష్టాలను సమస్యలను అడిగి తెలుసు కున్నారు. కూటమి ప్రభుత్వం రైతులను ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి ఇప్పటివరకు ఏ ఒక్కటి అమలుపరిచిన దాఖలాలు లేవన్నారు. అన్ని వర్గాల ప్రజలు మోసపూరిత హామీలతో మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. దేశానికి వెన్నెముక అయినటువంటి రైతుల కష్టాలపై ఏమాత్రం ఆలోచించకపోవడం బాధాకరమన్నారు. ఎప్పుడూ అమరావతి పేరుతో ప్రచార గొప్పలు తప్ప ఈ కూటమి ప్రభుత్వం ఏమి చేసింది లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని సూచించారు. అధికారం చేపట్టిన ఏడాదిలోపే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్నారని అన్నా రు. అమలు కానీ హామీలతో అధికారం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు పెడతున్నారన్నారు. ఎమ్మెల్యే వెంట వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్, సర్పం చుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కిషోర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కరీముల్లా శ్రీరాములు, సర్పంచ్ రెడ్డి నారాయణ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

వడదెబ్బపై తగు జాగ్రత్తలు తీసుకోవాలి : కలెక్టర్



రాయచోటి : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్


ప్రజాశక్తి-రాయచోటి

వృద్ధులు, చిన్నపిల్లలు, బాలింతలు వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 'బీట్ ద హీట్' అనే అంశం పట్టణంలోని కొత్తపేట రామాపురంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఉష శ్రీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు, అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుతూ వడదెబ్బకు గల కారణాలను, రాకుండా వచ్చిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రియాజ్ బేగ్, డిఎన్ఎంఓ,డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైద్యులు డాక్టర్ వసీంఅక్రమ్, డాక్టర్ లతీఫ్,హెల్త్ ఎడ్యుకేటర్లు బలరామరాజు, ఉషారాణి, రాజగోపాల్, హెల్త్ సూపర్వైజర్లు వెంకటేశ్వర్ రెడ్డి, నూర్జహాన్ బేగం, అర్బన్ పరిధిలోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె:** వడ దెబ్బపై ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని మదనపల్లి డిఎల్‌డిఒ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. ప్రతినెల మూడవ శనివారం సందర్భంగా చేపడుతున్న స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ ప్రత్యూషతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పిహెచ్‌సి కేంద్రం నుంచి స్థానిక బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు ప్రాథమిక వైద్య పరీక్షలు, మందులను అందించారు. ప్రస్తుతం ఎండ వేడి దాటికి ప్రజలు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని, ప్రజలు ఇళ్ల వద్దే ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రమేష్, ఆర్డబ్ల్యూఎస్ మిథున్ చక్రవర్తి, హౌసింగ్ ఎఇ అమర్నాథ్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, టిడిపి నాయకులు శ్రీపతి, ఖాసింఖాన్, సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండలంలో మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టినట్లు సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గ్రామంలో బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించడం, వీధులలో వీధి దీపాలను మరమ్మతులు చేసి అవసరమైన చోట కొత్త ఎల్ఇడి బల్బులను బిగించినట్లు తెలిపారు. పుల్లంపేట నాలుగు రోడ్ల కూడలి వరకు బీట్‌దహీట్ కార్యక్రమం పై అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, విస్తరణ అధికారి ముత్తయ్య, ఆర్డబ్లూఎ ఆర్డబ్ల్యూఎస్ ఎఇ దినేష్, మండల స్థాయి అధికా రులు, కార్యాలయ సిబ్బందిపాల్గొన్నారు. **కలికిరి :** కలికిరి మేజర్ గ్రామ పంచాయతీ ఇఒ జి.అశోక్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ శనివారం కలికిరి గ్రామ సచివాలయం ఆవరణలో చలివెంద్రం, వైద్య శిబిరం, క్రాస్ రోడ్‌లో గ్రీన్ షెడ్‌ను ఎంపిడిఒ, డివిజనల్ ఇంజినీర్ మధుసూదన్ ప్రారంభించారు. ఎంపిడిఒ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ అధికారి జె.సురేంద్రబాబు, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ.వేణుగోపాల్ రెడ్డి, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ శంకర్, వెలుగు ఎపిఎం దేవసేన, సర్పంచ్ ఎల్లయ్య, ఎపిఒ మంజుల, వెలుగు ఎంపిఎం దేవసేన, టిడిపి నాయకులు యోగేష్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు అరుంధతి, సర్తాజ్ బేగం, డాక్టర్. కావ్యగంద,వెలుగు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **నందలూరు :** వేసవికాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందలూరు మండల ప్రత్యేక అధికారి రామచంద్రనాయక్ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లసంఘము అధ్యక్షులు జంబు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త బండ్ల లోనే వేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధాకృష్ణ, ఇఒఆర్‌డి సురేష్, గ్రామపంచాయతీ ఇఒ సురేష్, డ్వాక్రా సిబ్బంది రామ్మోహన్, సచివాల ఇంజఇంజినీర్ అనిల్, కార్యదర్శి సుబ్బరామయ్య, రఫీ, గ్రామపంచాయతీ క్లాత్ మిత్రాలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛ కార్యక్రమంలో ప్రజలందరూ భాగ్య స్వాములు కావాలని ఎంపీడీవో ఉపేందర్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలో అన్ని గ్రామ సచివాలయాలు , ఆరోగ్య ఉప కేంద్రాలలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు కోసి వారి పల్లి పీహెచ్సి డాక్టర్ మెడికల్ ఆఫీసర్ అనుపమ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య విషయాలపై సూచనలు ఇచ్చారు. వేసవిలో ఒడదప్ప బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఓరేజ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమా లలో డాక్టర్ ముని కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



నందలూరు : ర్యాలీలో ఎంపిడిఒ, సర్పంచ్, ప్రజలు

రెడ్డిపల్లిలో రైళ్ల నిలుపుదలకు కృషి



ప్రజలతో మాట్లాడుతున్న రైల్వే అధికారులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లి రైల్వేస్టేషన్‌లో రైళ్ల నిలుపుదల తీసుకువచ్చి చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తామని డిఆర్‌యుసిసి సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైలు స్టార్టింగ్ సమస్యపై రెడ్డిపల్లి గ్రామ ప్రజలు ఎంపీ మిథున్ రెడ్డికి విన్నవించుకోగా సానుకూలంగా స్పందించిన ఆయన రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకుపోగా ఆయన గుంతకల్లు ఆర్ఎంకు సూచించారు. రైల్వే డిఆర్ఎం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయగా శుక్రవారం కమిటీ సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, కడప డివిజన్ సిసి సురేంద్రనాథ్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కేశవ్‌పసాద్ రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా తల్లెం భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ రైల్వే స్టేషన్ బ్రిటిష్ కాలంలో నిర్మించబడిందని, ఇక్కడి నుంచి చెన్నై, ముంబై తదితర సుదూర ప్రాంతాలకు రాకపోకలు నిర్వహిస్తూ ఉద్యాన పంటలతో పాటు బొగ్గు వంటి వాణిజ్య పరమైన రవాణా నిత్యం జరుగుతూ ఉండేదని తెలిపారు. కాలక్రమేనా ఈ రైల్వే స్టేషన్ కనుమరుగు కావడంతో రైల్వే స్టేషన్ పరిధిలోని సుమారు 30 గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొం టున్నారని తెలిపారు. ఈ సమస్యను ఉన్నతాధికారులకు నివేదిక పంపి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రెడ్డిపల్లె రైల్వేస్టేషన్లో ఉన్నంత రైల్వే భూమి ఈ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ లేదని పేర్కొన్నారు. స్టేషన్‌కు సంబంధించి మరమ్మతులు కూడా వెంటనే ప్రారంభించడానికి రైల్వే అధికారులను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సయ్యద్‌ముస్తాక్, దేసు నారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నందకుమార్ రెడ్డి, రవి, జనార్ధన, నాగేశ్వరరావు, ప్రవీణ్ కుమార్ రెడ్డి, అచ్యుత్ రెడ్డి, అశోక్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకుడు

రక్తదానం గొప్పది : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ డిఇఒ శివప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణం లోని శ్రీ దీప బ్లడ్ బ్యాంక్‌లో డాక్టర్ అబ్దుల్ కలాం యువ కెరటం ట్రస్ట్ డైరెక్టర్ , యూత్ ఐకాన్ వినయ్ కుమార్ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న డిఇఒ, డిప్యూటీ డిఇఒ, హీరో భరత్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ వినయ్‌కుమార్ సేవలు విద్యార్థులు, యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన జన్మదిన వేడుకల సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం చాలా సంతోషకర మైన విషయం అన్నారు. హీరో భరత్ మాట్లాడుతూ వినయ్‌కుమార్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంతమంది విద్యార్థుల కోసం దాదాపు ఆరు సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. వినయ్‌కుమార్ మాటకడుతూ నా జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొని రక్త దానం చేసిన 20 మందికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుక లు నిర్వహించారు.కార్యక్రమంలో శ్రీదీప బ్లడ్‌బ్యాంక్ నిర్వాకులు మల్లి కార్జునరెడ్డి, ట్రస్ట్ సభ్యులు, రక్త దాతలు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ప్రశాంత్ నగర్‌లో స్థాపించిన బెటర్ లైఫ్ ఆయుర్వేద ఆస్పత్రి, పంచకర్మ సెంటర్, ఎపి మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో దీర్ఘకాలిక రోగాలైనకీళ్ళనొప్పులు, సయాటిక, డిస్క్ ప్రోలాప్స్, జీర్ణకోశ సమస్యలు, చర్మ రోగాలు, ఆస్తమా, అల్సర్, స్త్రీల సమస్యలు తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. సుమారు 150 పైగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ సిద్దారెడ్డి, స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ భానుప్రకాష్, వైద్యులు రాజేష్, అజమతుల్లా, అశోక్ వర్ధన్, నారాయణ, రవి, బెటర్ లైఫ్ అయుర్వేదిక్ హాస్పిటల్ స్థాపకులు డాక్టర్లు దివ్య, దీప్తి, సుందరవదన, దిసికాశర్మ, రూపేష్, గాయత్రి ఆయుర్వేద ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ ఇందు ప్రియదర్శిని పాల్గొన్నారు.

విఆర్‌ఒను సస్పెండ్ చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మండలంలోని బసినికొండ సచివాలయంలో పని చేస్తున్న విఆర్ఒ మహేష్‌నాయక్ గత 17 రోజులుగా అందుబాటులో లేకపోవడంతో అతన్ని సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కలెక్టర్‌కు సిఫారసు చేశారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా బసినికొండ సచివాలయం పరిశీలిం చినప్పుడు అక్కడ విఆర్ఒ గత 17 రోజులుగా అందుబాటులో లేడని గుర్తిం చారు. సచివాలయంలో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బాధ్య తారాహిత్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఆగ్రహించిన ఎమ్మెల్యే బాధ్యత లేని విఆర్‌ఒను వెంటనే సస్పెండ్ చేస్తామన్నారు. ఇక్కడ మహిళా పోలీస్‌గా పనిచేస్తున్న కె.రాణి సైతం అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఎన్ఎం కాంచన గౌరీ సిటిఎం పిహెచ్‌సి వెళ్లినట్లు మూమెంట్ రిజిస్టర్‌లో రాసి ఉందని, వెరిఫై చేసి ఆమె ఒకవేళ విధుల్ని దుర్వినియోగం చేసినట్లయితే ఆమెపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా ఇలాంటి సంఘటనలు పునరా వతమైతే ఉపేక్షించేది లేదని, ఉద్యోగస్తులు బాధ్యతగా పనిచేయాలన్నారు.

ధ్వజస్తంభాన్ని ఆవిష్కరించిన మంత్రి 'మండిపల్లి'

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి : రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్ర సాద్‌రెడ్డి శనివారం మండల పరిధిలోని పందిళ్ళపల్లె గ్రామం, జె.కొత్త పల్లి లోని రాములుగుడిలో నూతనంగా ఏర్పాటుచేసిన ధ్వజస్తంభాన్ని ఆవిష్క రిం చారు. గ్రామ ప్రజలు మంత్రికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండ యువ నాయకుడు యనమల మదన్మోహన్, రాజం పేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్, షేక్ ఆరీఫ్, సయ్యద్ మసూద్, ముక్తార్‌అహ్మద్, రిజ్వాన్ పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాభారతానికి రూ.లక్ష సాయం

రామాపురం : వింటే భారతం వినాలి.. తింటే గారెలు తినాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మహాభారత యజ్ఞ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తింటే గారెలు తినాలి వింటే భారమే వినాలని మహాభారతం ఎంత విన్నా ఇంకా వినాలనిపిస్తుందన్నారు. 11 రోజులు పాటు జరిగే మహాభారతంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా దిగ్విజయంగా పూర్తి చేసినందుకు మహాభారతం నిర్వాహకులకు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు. నిర్వాహకులకు రూ.లక్ష సాయం అందించారు. వచ్చే ఏడాది మహా భారతం మరింత ఘనంగా నిర్వహించాలనితెలిపారు. మంత్రిని మహాభారతం నిర్వాహకులు పూల మాలలు, దృశ్యాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేష్‌రెడ్డి, భవన వెంకటరామిరెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, ప్రతాపరెడ్డిపాల్గొన్నారు.



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామప్రజలు



యల్లటూరుకు స్వాగతం పలుకుతున్న భువనగిరిపల్లె గ్రామస్తులు

ఘనంగా 'యల్లటూరు' పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు పుట్టినరోజు వేడుకలు శనివారం రాజంపేట మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మన్నూరు ఎల్లమ్మ ఆలయం సమీపంలో గల యలటూరు భవన్‌లో కార్యకర్తలు, అభిమానులు మధ్య భారీ కేకు కట్ చేసి అల్పాహారం ఏర్పాటు చేశారు. రాజంపేట పార్లమెంట్ వ్యాప్తంగా కూటమి నాయ కులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన భువనగిరి పల్లె లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీనివాసరాజు మాట్లాడుతూ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి రూ.4లక్షలు విరాళం ప్రకటించారు. గాలిగోపురం నిర్మాణానికి రూ.2 లక్షలు, గర్భాలయం వెండి తాపడం కొరకు రూ.2 లక్షలు అందిస్తానని చెప్పారు. అనంతరం ధర్మకర్తల మండలి ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందిం చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, జనసేన నాయకులు, గామ ప్రజలు పాల్గొన్నారు.



మహిళలకు సూచనలు ఇస్తున్న డిఎల్‌డిఒ అమర్నాథ్‌రెడ్డి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : డిఎల్‌డిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం బలంగా నిలబడుతుందని డిఎల్‌డిఒ అమర్నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం ద్వారా మహిళలకు ఉచితంగా ఇస్తున్న టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. మహిళలు స్వయంగా, ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒసి, బిసి, మైనారిటీ మహిళలకు నెల రోజులు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇవ్వడంతో పాటు, ఉచితంగా కుట్టు మిషన్లను అందిస్తున్నాదని పేర్కొన్నారు. మండలంలో ఒసి, బిసి, మైనారిటీ వర్గాలకు చెందిన 144 మంది మహిళలు కుట్టు మిషన్లకు దరఖాస్తు చేసుకున్నారని, వీరికి ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు బ్యాచులుగా విభజించి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలకు 80 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలన్నారు. మహిళలకు టైలరింగ్‌పై పూర్తి అవగాహన, నైపుణ్యాన్ని పెంపొందించేలా శిక్షణ ఇవ్వాలని ట్రైనర్ సావిత్రమ్మకు సూచించారు. శిక్షణ పూర్తి అయిన తర్వాత ధ్రువీకరణ పత్రంతో పాటు కుట్టు మిషన్‌ను అందించడం జరుగుతుందన్నారు. టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, ట్రైనర్ సావిత్రమ్మ పాల్గొన్నారు.

సౌమ్యనాథ అన్నదాన ట్రస్ట్‌కు రూ.40 వేలు విరాళం

ప్రజాశక్తి-నందలూరు

శ్రీ సౌమ్యనాథ సేవాట్రస్ట్ వారి శాశ్వత అన్నదాన కార్యక్రమానికి రాజంపేటకు చెందిన నిట్టూరు బాబు, మున్ని దంపతులు రూ.40116లు ఆలయ కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, సభ్యులు సుబ్బరామయ్యకు శనివారం అందించారు. ఈ సందర్భంగా రామసుబ్బన్న మాట్లాడుతూ అన్నదాన ట్రస్ట్‌కు ఆర్థికంగా సహకరించిన దాత కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం భక్తుల కోసం వారానికి రెండు రోజులు పాటు శుక్ర శనివారాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. నిత్యాన్నదాన కోసం కార్యాచరణ రూపొందించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సాయి,పెంచలయ్య,వరదయ్య,శివ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తికి డాక్టరేట్



కృష్ణమూర్తి

ప్రజాశక్తి-పీలేరు : నియోజకవర్గం పరిధిలోని కెవిపల్లి మండలం, గ్యారంపల్లి కురవపల్లికి చెందిన మంచూరి ఎర్రయ్య కుమారుడు, మంచూరి కృష్ణమూర్తి పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. రసాయన శాస్త్ర విభాగంలో సమర్పించిన పరిశోధనా వ్యాసాల ఆధారంగా ఆయన పిహెచ్‌డి డాక్టరేట్ ఆలభించింది. శనివారం జరిగిన అనంతపురం జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవ వేడుకల్లో మంచూరి కృష్ణమూర్తికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, విశ్వవి ద్యాలయం ఉపకులపతి హెచ్.సుదర్శన్‌రావు ఈ ప్రతిష్టాత్మక గౌరవాన్ని ఆయనకు ప్రదానం చేశారు. అద్భుతమైన విజయాన్ని పురస్కరించుకుని, ఆయన తల్లి సిద్ధమ్మ, భార్య రాజేశ్వరి, కుమారుడు కేతన్ గణేష్, కుమార్తె కోషిత అపారమైన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో అమాయక ప్రజలు

- బి.కొత్తకోట వాసుల ఖాతాల్లో రూ.20 లక్షలు స్వాహా

- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

సైబర్ నేరగాళ్లు కొత్త పన్నాగం పన్నుతున్నారు. మేము ప్రభుత్వం తరపున ఫోన్ చేస్తున్నాము అని పట్టణంలో కొంతమందికి ఫోన్ చేసి మీరు జగనన్న ప్రభుత్వంలో ఏపి స్కీములో ఉన్నారు, ఎంత మొత్తంలో డబ్బులు పడ్డాయి, ప్రస్తుతం చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో ఏ పథకాలకు డబ్బులు పడతాయో వివరిస్తూ వారి అకౌంట్లో ఒటిపిలను కనుక్కొని ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.50 వేలు, రూ.60 వేల వరకు సైబర్ నేరగాళ్లు దోచుకొన్నట్లు సమాచారం. బి.కొత్తకోట బిసి కాలనీకి చెందిన శంషీర్‌వల్లి కుమార్తె షేక్ శబరీన్ తాజ్ ఖాతాలోని రూ.65వేలు స్కామర్లు దోచుకున్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని పోలీసు వారు సూచిస్తున్నారు. స్కామెర్లు ఎవరైనా మీకు ఫోన్ ద్వారా అలా సంప్రదిస్తే పోలీసులకు గానీ, లేదా 1903 సైబర్ క్రైమ్ వారిని సంప్రదించాలని సూచించారు.

ఈతకు వెళ్లి జెఎన్‌టియు విద్యార్థి మృతి

ప్రజాశక్తి-కలికిరి

ఈతకు వెళ్లి జెఎన్‌టియు విద్యార్థి మృతి చెందిన సంఘటన కలికిరిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలానికి చెందిన సూర్యనారాయణ కుమారుడు చింతరాకేష్ జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదట సంవత్సరం చదువుతున్నాడు. శనివారం కళాశాల సమీపంలోని పొలంలో ఉన్న బావి దగ్గరకు పదిమంది స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి ఈత ఆడుతుండగా ప్రమాదవశాత్తు మట్టిలో కూరుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. బావి గట్టు పైన ఉన్న స్నేహితులు కళాశాల అధ్యాపకులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫైర్ ఇంజన్ సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ మదనమోహన్ రెడ్డి తెలిపారు.